క్లుప్తంగా

ఘనంగా దత్త జయంతి



సాయిబాబా ఆలయంలో జరుగుతున్న పూజలు

సాలూరు: దత్త జయంతి సందర్భంగా శనివారం పట్టణంలో షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలాభిషేకాలు, హోమాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భారీ అన్న సమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి

- యూటీఎఫ్ నాయకులు

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల టీచర్లను 400 కిలోమీటర్ల దూరంలో గల పాడేరు ప్రాంతంలో గురుకుల పాఠశాలలకు డిప్యుటేషన్ వేయ డం తగదని.. ప్రభుత్వం వెంటనే స్పందించి డిప్యుటేషన్లు రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆరిక భాస్కరరావు డిమాండ్ చేశారు. 25 రోజులుగా స్థానిక ఐటీడీఏ ముఖద్వారం వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న గిరిజన గురుకులాల అవుట్ సోర్సింగ్ టీచర్లకు యూటీఎఫ్ నాయకులు శనివారం సంఘీభావం తెలిపారు. ఆశ్రమ పాఠశాలల ఎస్జీటీ ఉపాధ్యాయులకు పక్క మండలంలో సర్దుబాటు చేయాల్సింది పోయి జిల్లాలను దాటి డిప్యుటేషన్ వేయడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్‌లో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుండంగి కృష్ణారావు, సీతంపేట మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కె.ఆనందరావు, పకీరు, బి.జయప్రకాష్, ఎ. రాము, సింహాచలం పాల్గొన్నారు.

శిశువు ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది



శిశువుకు చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

సీతంపేట: మండలంలోని తోటగూడ గ్రామానికి చెందిన సవర శారద రెండో కాన్పు నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేరింది. శనివారం ఉదయం 10 గంటలకు మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే బిడ్డ ఉమ్మనీరు తాగడంతో ఎటువంటి చలనం లేకపోవడంతో వైద్యులు మనోజ్‌కుమార్, సుభాష్ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. దీంతో 108 సిబ్బంది గణపతి, మురళి తల్లీబిడ్డలను అంబులెన్స్‌లో తీసుకువస్తూ ఏఎంబీ బ్యాగ్ ద్వారా ఆక్సిజన్ అందించడంతో మార్గమధ్యలో బేబీకి కదలికలు వచ్చాయి. రిమ్స్‌కు సకాలంలో శిశువును చేర్చడంతో అక్కడి వైద్యులు వెంటిలేటర్‌పై శిశువుకు చికిత్స అందిస్తున్నారు. దీంతో పలువురు 108 సిబ్బందిని అభినందించారు.

‘పది’కి ప్రణాళిక సిద్ధం



బలిజిపేట ఉన్నత పాఠశాలలో చదువుతున్న పది విద్యార్థులు

- ఉత్తమ ఫలితాల సాధనకు కసరత్తు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

బలిజిపేట:

ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు సత్ఫలితాలు సాధించేందుకు వంద రోజుల ప్రణాళికను విద్యాశాఖాధికారులు సిద్ధం చేశారు. ఈ ఏడాది నుంచి సీబీఎస్ఈ సిలబస్ ఆధారంగా పదో తరగతి పరీక్షలు ప్రభుత్వం నిర్వహించనుంది. అందుకు తగ్గట్టుగా ప్రశ్న పత్రాల తయారీని ఎస్సీఈఆర్టీ సిద్ధం చేయనుంది. ఇందుకుగాను విద్యార్థులను సిద్ధం చేసేందుకు అధికారులు పక్కా ప్రణాళిక రచించారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఒక గంట పాటు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ముందుగా సిలబస్ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. వాస్తవానికి ఈ నెల 15లోగా సిలబస్ పూర్తి చేయాల్సి ఉంది. ఇటీవల మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించడం వల్ల సుమారు వారం రోజుల పాటు విద్యా బోధనకు ఆటంకం కలిగిందనే విమర్శలున్నాయి. డిసెంబర్ నెలలో ఉపాధ్యాయులు బిజీ షెడ్యూల్‌లో ఉన్నారు. శాంప్ 1 పరీక్షలు, స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ, ఉపాధ్యాయుల సంవత్సరాంపు సెలవులతో ఈ నెల పూర్తిగా విద్యకు ఆటంకం కలిగే అవకాశాలున్నాయి. అయినా విద్యార్థులను ఎలా ముందుకు తీసుకువెళ్లాలనే దానిపై ప్రణాళికలు రచించి అమలు చేసేందుకు సిద్ధమయ్యారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక సీసీఎల్ఎస్‌లు

రానున్న వంద రోజుల్లో స్టడీ అవర్స్ నిర్వహించనున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక సీసీఎల్ఎస్‌లు అందనున్నాయి. వీటిని మంజూరు చేయడమే కాని ఇంతవరకు అమలు చేయలేదని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. బలిజిపేట మండలంలో తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాల ఉన్నాయి. వీటిలో 341మంది పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉన్నారు.

పక్కాగా ప్రణాళిక అమలు



పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఏర్పాటు చేసిన వందరోజుల ప్రణాళిక పక్కాగా అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాం. ఉన్నత పాఠశాలలకు ఒకొక్క ప్రత్యేకాధికారిని నియమించి వారికి ఆ పాఠశాల దత్తత చేయడం జరిగింది. ఆ ప్రకారం మంచి ఫలితాలు వచ్చేందుకు కృషి చేస్తున్నాం.

– సామల సింహాచలం, ఎంఈఓ–1, బలిజిపేట

ప్రణాళిక ఇలా..

- వ్యక్తిగత పర్యవేక్షణతో విద్యార్థులలో నైపుణ్యాలను పెంచడం.
- విద్యార్థులకు పరీక్షలంటే భయం తగ్గించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి పరీక్షల నిర్వహణ.
- ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించడం.
- వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు తగిన సమయం కేటాయించడం.
- రోజూ ఉదయం 8.15నుంచి 9.15 వరకు, సాయింత్రం 4 నుంచి 5గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహించడం.
- రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున వారానికి 7సబ్జెక్టులు బోధించడం.
- ప్రత్యేక తరగతులు ద్వారా విద్యార్థుల్లో భయాన్ని తొలగించడం.
- నిత్య పర్యవేక్షణతో వారికి పరీక్షల నిర్వహణ.
- ఎస్ఎస్సీ బ్లూ ప్రింట్‌తో విద్యార్థులకు ప్రీ–ఫైనల్ పరీక్షల నిర్వహణ.

అధికారుల హైడ్రామా..!



గలావల్లిలో ఎన్నికల సమయంలో చేతులెత్తి ఓటు వేస్తున్న ఓటర్లు

బలిజిపేట: సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికారులు హైడ్రామా నడిపారు. మండలంలోని గలావల్లి తామర చెరువు సాగునీటి సంఘం ఎన్నికలను అధికారులు ఉద్దేశపూర్వకంగానే వాయిదా వేశారని ఓ వర్గం సభ్యులు ఆరోపించారు. ఈ చెరువుకు ఆరు టీసీలు ఉన్నాయి. ఎన్నికకు ఓ వర్గం వారు హాజరయ్యారు. రెండో వర్గం వారికి గెలుపుపై అనుమానం ఉండడంతో గైర్హాజరయ్యారు. అయితే ఎన్నిక ప్రక్రియ ప్రారంభించి ఒక్కో టీసీకి ఎన్నిక ప్రకియను ప్రారంభించారు. రెండు టీసీలకు ఎన్నిక కూడా నిర్వహించారు. మరో రెండు టీసీలకు ఎన్నిక నిర్వహించేందుకు సభ్యులను ఒక గదిలో కూర్చోబెట్టి చేతులెత్తిన సమయానికి ఎన్నికల మండల అధికారిణి కవిత(ఇరిగేషన్ మండల ఏఈ) వచ్చి లేని కారణాలు సృష్టించి వాయిదా వేశారని సభ్యులు ఆరోపించారు. ఎందుకు వాయిదా వేశారని సభ్యులు, ఓటర్లు ప్రశ్నించినా సరైన సమాధానం ఇవ్వలేదు. ఈ క్రమంలో 9సీ ఫారంలో ఒక వర్గం వారు హాజరు కాగా, రెండో వర్గం వారు హాజరు కాలేదని, వివాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాటిని నివారించలేమని కారణం చెబుతూ వాయిదా వేస్తున్నట్టు రాసి వెళ్లిపోయారు. ఇది అప్రజాస్వామికమని అభ్యర్థులు, సభ్యులు ఆరోపించారు.

సీతానగరంలో..

సీతానగరం: మండలంలో పలు గ్రామాల్లో నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

హిమోగ్లోబిన్ పరీక్షలపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్ మోహనరావు

పార్వతీపురం టౌన్: టూ హెచ్‌బీ పరికరంతో హిమోగ్లోబిన్ పరీక్షలపై శిక్షణ వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో, హైరిస్క్ గర్భిణుల నిర్వహణ నియమాలపై శిక్షణ స్థానిక ఎన్జీఓ హోమ్‌లో శనివారం నిర్వహించారు. వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు కార్యక్రమాల్లో పాల్గొని వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. రక్తహీనత గుర్తించడంలో హిమోగ్లోబిన్ పరీక్ష కీలకమని, నివేదికలు స్పష్టంగా ఉండాలంటే పరీక్ష నిర్వహణలో నిర్దేశించిన పద్ధతులు, ప్రమాణాలను అవలంభించడం అవసరమని పేర్కొన్నారు. వైద్య పరికరాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా, వాటి నాణ్యతా మెరుగ్గా ఉండేలా జాగ్రత్త పర్చాలన్నారు. అవసరమైన వారికి కొత్త హెచ్‌బీ డివైజ్‌లను అందజేశారు. శిక్షణలో పొందిన పరిజ్ఞానంతో మెరుగైన ఫలితాలకు కృషి చేయాలన్నారు. టూ హెచ్‌బీ పరికరంతో సిబ్బంది పరీక్ష చేసే విధానాన్ని గమనించారు. ఆర్మన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ గర్భిణులలో ప్రమాదకర ఆరోగ్య సమస్యలను సకాలంలో గుర్తించడం అత్యంత ఆవశ్యకమన్నారు. తద్వారా హైరిస్క్ సమస్యను ఏ విధంగా నివారించాలి.. అందుకు అవసరమైన కార్యాచరణ సత్వరమే చేపట్టాలన్నారు. శిక్షణకు సంబంధించి పుస్తకాలను సిబ్బందికి అందజేశారు. వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐహెచ్ఆర్పీటీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రశాంత్, మెడికల్ ట్రైనింగ్ ఆఫీసర్ డా.కృష్ణమూర్తి, రిగ్ నానో సిస్టం ఇండియా టెక్నికల్ ఇంజినీర్స్ దుర్గాప్రసాద్, ఎస్.ఇమ్రాన్, కార్యాలయ ఈఓ శ్రీనివాసరావు, ఏఎస్ఎం, సీహెచ్ఓ(ఎమ్ఎల్‌హెచ్‌పీ)లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన



విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో బలిజిపేట, నారాయణపురం, పలగర గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు విద్యుత్ చార్జీల పెంచే ప్రసక్తే లేదని, తగ్గిస్తామని చెప్పి... అధికారంలోకి వచ్చాక ప్రజలపై మోయలేని భారాలను మోపుతున్నారని దుయ్యబట్టారు. నిరసన కార్యక్రమాల్లో ఆ పార్టీ నాయకులు భానుమూర్తి, డి.త్రినాధ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. – బలిజిపేట

జాతీయ లోక్ అదాలత్‌లో 511 కేసుల పరిష్కారం



పట్టణంలో నిర్వహిస్తున్న మెగా జాతీయ లోక్ అదాలత్

సాలూరు: పట్టణంలోని జూనియర్ కోర్టులో జడ్జి కె.రమేష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైంది. సివిల్, క్రిమినల్ తదితర సుమారు 511 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు టి.తిరుపతిరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై కన్నెర్ర



పార్వతీపురం టౌన్: కరెంటు బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



సీతానగరం: మండల కేంద్రంలో పెంచిన విద్యుత్ బిల్లులు తగులబెడుతున్న సీపీఎం కార్యకర్తలు

పార్వతీపురం టౌన్:

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు వాకాడ ఇందిర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదానీతో విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ సీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో మద్దాల వారి వీధిలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అదానీకి అమ్ముడుపోయి విద్యుత్ ట్రూ అప్ చార్జీలను వినియోగదారులపై వేసిందన్నారు. వీటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లులను తగులబెట్టారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు, ముట్నూరు వెంకటరమణ, హనుమంతు రాము, నివాస ప్రాంత పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

మక్కువ: మండలంలో వెంకట భైరిపురం గ్రామంలో విద్యుత్ చార్జీలు పెంపునకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయుకుడు టి.ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలు పేరుతో కరెంట్ చార్జీలు పెంచారని, వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిట్టల సీతారాం, చంటి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో...

సీతానగరం: టీడీపీ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచినందుకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో మహిళా సంఘాలు, విద్యుత్ వినియోగదారులు శనివారం బిల్లులు తగులబెట్టారు. సీఐటీయూ జిల్లా నాయకుడు జి.వెంకటరమణ ఆధ్వర్యంలో బుడ్డిపేటలో బిల్లులు దగ్ధం చేసారు. మండల కేంద్రంలోని జంక్షన్ వద్ద సీపీఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ బిల్లులు దగ్ధం చేసారు. రెడ్డివానివలస, బగ్గందొరవలస సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి వేణు, ఆర్.ఈశ్వరరావు ఆధ్వర్యంలో బిల్లులు తగులబెట్టారు. పెంచిన చార్జీలు తగ్గించక పోతే దశల వారీగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు పి.చిన్నారావు, బి.శ్రీనివాసరావు, అచ్యుతరావు, త్రినాధ్, సీతం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో..



సాలూరు: విద్యుత్ బిల్లుల పెంపుపై నిరసన

సాలూరు: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం నిరసన తెలిపారు. విద్యుత్ బిల్లులను తగులబెట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆదినారాయణ, ఈశ్వరరావు, రాణి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



- యంత్రాల వినియోగంతో ఎండుగడ్డి కొరత
- విపరీతంగా పెరుగుతున్న దాణా ఖర్చులు
- మరోవైపు జీవాలను వేధిస్తోన్న వ్యాధులు
- తగ్గుతున్న పాల దిగుబడి
- ఆందోళనలో పాడిరైతులు

పశుపోషణ భారం

దాణా రేట్లు ఇలా..

దాణా రకం	ధర
తవుడు(50 కిలోలు):	రూ.1400
నూకలు(పెద్దవి 50 కిలోలు):	రూ.1200
నూకలు(చిన్నవి 50 కిలోలు):	రూ.1100
బఠాణి బొత్తు(20 కిలోలు ఎ–1రకం):	రూ.1200
బఠాణి పిండి(50 కిలోలు):	రూ.1500
మినప పొట్టు(50 కిలోలు):	రూ.1250
పెసరపొట్టు(50 కిలోలు):	రూ.1200
ట్రాక్టరు వరిగడ్డి(గతంలో):	రూ.5500

రాజాం నియోజకవర్గంలో పాడి పశువులు ఇలా..

మండలం	పాడి పశువులు (ఆవులు, గేదెలు)
రాజాం	7800
రేగిడి	8200
వంగర	8600
సంతకవిటి	7400

రాజాం సిటీ:

పాడిరైతుకు పశుపోషణ భారమైంది. వ్యవసాయంలో యాంత్రీకరణ(యంత్రాల వినియోగం) కారణంగా ఎండుగడ్డి అంతగా దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటు విపరీతంగా పెరిగిన దాణా ఖర్చులు ఓ వైపు.. జీవాలను నిత్యం వేధించే రకరకాల వ్యాధులు మరోవైపు.. పశుపోషకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పశుగ్రాసం కొరతతో జీవాలు బక్కచిక్కిపోయి ఫలితంగా పాల దిగుబడి తగ్గిపోతోందని పాడిరైతులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పశువులు పెంచేందుకు ఎవరూ అంతగా ఆసక్తి కనబరచడం లేదు. రాజాం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ వ్యవసాయంలో ఏటా యంత్రాల వినియోగం పెరుగుతుండడంతో ఎండుగడ్డి కొరత ఏర్పడుతోంది. ఎక్కడో ఓ చోట దొరికే కాస్త ఎండుగడ్డికి మంచి డిమాండ్ ఏర్పడుతుండడంతో కొంతమంది పశు యజమానులు గడ్డిని కూడా కొనుగోలు చేయలేని దుస్థితి తలెత్తుతోంది. ఓ వైపు దాణా ఖర్చులు, మరోవైపు ఎండుగడ్డి ఖర్చు భారంగా మారడంతో పశుపోషణ ఎలా అని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం దాణా ఖర్చుల భారమైనా లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు.



ఇలా యంత్రాలతో వరికోతలు చేపడుతుండడంతో గడ్డి దొరకని పరిస్థితి..

పాడి కలిసిరావడం లేదు..

ఒకప్పుడు కలిసొచ్చిన పాడి పరిశ్రమ ప్రస్తుతం కలిసిరావడం లేదు. ఓ పక్క మేతలు లేక.. మరోపక్క వ్యాధులు భయంతో ఇబ్బందులు పడుతున్నాం. దాణాల రేట్లు బాగా పెరిగిపోయాయి. అయినా పాలవ్యాపారంతో కుటుంబం పోషించుకోవచ్చన్న ఆశతో దాణా కొనుగోలు చేసి, వినియోగిస్తున్నాం. ఇదే అదనుగా వ్యాపారులు దాణా ధరలు పెంచేస్తున్నారు.

–శాసపు సత్తిబాబు, పాడిరైతు, పొనుగుటివలస గ్రామం

సబ్సిడీపై దాణా అందించాలి..

ప్రస్తుతం దాణా ఖర్చుల భారమవుతున్నందున ప్రభుత్వమే సబ్సిడీపై దాణా అందించాలి. అలాగే సకాలంలో పశువైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. పాల దిగుబడి పెరగాలంటే పశువులకు తగినంత పౌష్టికాహారం అందివ్వాలి. ప్రభుత్వ సహకారం ఉంటే బాగుంటుంది.

–ఎ.వెంకటేష్, పాడిరైతు, రాజాం

ఇష్టారాజ్యంగా ధరలు..

పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు నానాపాట్లు పడాల్సి వస్తోంది. రైతులంతా పశువుల కోసం ఎండుగడ్డితో పాటు తవుడు, నూకలు, బఠాణి బొత్తు, పెసర బొత్తు, మినప పొట్టు తదితర వాటిని వినియోగిస్తున్నారు. వీటినే ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఇష్టారాజ్యంగా వాటి ధరలు పెంచుకుంటూ పోతున్నారు. దీంతో పాడిరైతులు చేసేదేమీలేక తప్పనిసరి పరిస్థితుల్లో వారి పెంచిన ధరకే దాణా కొనుగోలు చేయాల్సి వస్తోంది. పాలసేకరణ కేంద్రాల్లో పాల ధరలు తక్కువగా ఇస్తున్నప్పటికీ దాణా మాత్రం ఎంత ఎక్కువైనా తప్పకుండా కొనుగోలు చేసి వేయాల్సి వస్తోందని, లేకపోతే ఆ వచ్చే పాలు కూడా పశువుల నుంచి సక్రమంగా రావని పాడిరైతులు వాపోతున్నారు. శీతాకాలంలో పాడి పశువులకు వేడిపుట్టి పాల దిగుబడి రావాలంటే ఇటువంటి దాణాలు వేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించి, ప్రభుత్వం ద్వారా దాణా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.